# ఆదిలాబాద్ గిరిజనుల సంస్కృతి - ప్రగతికి సవాళ్ళు

మధ్యభారతంలో నేటి ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ఘడ్ రాష్ట్రాలలో నాలుగు రాజధానులనుండి ఒకనాడు గోండులు రాజ్యమేలారు. అదిలాబాద్ గోండ్‌లకు చంద్రపూర్ రాజధాని. ఉట్నూరు, ఆహెరి, సిరొంచ, గడ్చిరోలి ఇవి చంద్రపూర్ రాజ్యంలో తాలూకాలుగా ఉండేవి. తరువాత చంద్రపూర్ రాజ్యం, నైజాం(ఆం.ప్ర.), మహారాష్ట్ర, చత్తీస్ఘడ్‌లోకి విడదీయడంతో వారి ప్రాభవం తగ్గిపోయింది. అదిలాబాదులో ఉట్నూరుమాత్రమే మిగిలిపోయింది. ఈ ప్రాంతంలో ఆదిమతెగ కొలాములు భీమనపూజారులు, పరధానులు గోండుల ఆశ్రితులు. నాయకపోడులు తెలంగాణ అంతా విస్తరించి ఉన్నారు. పాండవుల కథలు పాడేవారు తోటీలు. దేశంలోని అనేక రాష్ట్రాలలోగల బంజారాలు ఐక్యమై తోటి గిరిజనులకంటె అన్ని విధాలా ముందంజవేస్తున్నా, సగటు బంజారా బానిసగానే బతుకుతున్నాడు.

హెమెండార్ఫ్ గోండులను అధ్యయనం చేసి, నిజాం సలహాదారుగా పనిచేసి తెలంగాణలో గిరిజనుల అభివృద్ధికి దారులు వేశారు. ఆ తరువాత చాలామంది రచయితలు గోండ్‌ల సంస్కృతి సంప్రదాయాలను గ్రంథస్థంచేశారు. కాని ఇంతవరకు ఆ పుస్తకాలలో వివరాలు జనసామాన్యానికి తెలియవు. గిరిజనప్రాంతంలో ధార్మికరంగంలో పనిచేసేవారు చాలామంది బయటి సాధువులు, సంతుల పర్యటనలు ఏర్పాటు చేస్తుంటారు. కాని వారికి గిరిజనుల సంప్రదాయ పురాణాలపట్ల ఆసక్తిలేదు. ఎవరి సంప్రదాయాలు వారు ప్రచారం చేసుకుంటున్నారు.

1995-2000లలో గోదావరి, ఖమ్మం జిల్లాలలో గిరిజనులు ప్రభుత్వంనుండి భూమి రికార్డులను గుంజుకుని తమకు రావలసిన భూములను స్వాధీనం చేసుకుంటే, ఉట్నూరు రెవిన్యూడివిజన్‌లో 1987-90లలో చేసిన భూముల సర్వే, హక్కుల ఖరారు వివరాలు. గిరిజనులెవరికీ తెలియవు. ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన మైనింగ్ లైసెన్సులు ఇతర జిల్లాల గిరిజనప్రాంతాలలో రద్దైతే - ఈ జిల్లాలో అవి కొనసాగడమేకాదు, 1990లో ఆ పరిశ్రమలవల్ల నిర్వాసితులైన గిరిజనులకు ఈమధ్యదాకా ఉద్యోగాలు దొరకలేదు. తిర్యానిమండలం గిరిజనులు సింగరేణి కాలరీస్‌వారి భూసేకరణమీద విఫలపోరాటం చేస్తున్నారు.

గిరిజనులకు ఉపాధ్యాయ శిక్షణసంస్థలను 1950లలోనే ప్రారంభించారు. చాలామంది ఉద్యోగులైనారు. కాని సమాజం చైతన్యవంతంకాలేదు. అడగడం చైతన్యానికి గుర్తు. తమగూర్చి ఆంగ్లంలో చాలామంది రచయితలువ్రాసిన గ్రంథాలు తెలుగులో, తమతమ భాషలలో అనువదించి ప్రచురించవలసినదిగా వారు పట్టుబట్టిన దాఖలాలు లేవు: ఈ జిల్లా గిరిజనప్రాంతం పాఠశాలల్లో, గోండీ, కొలామీ, బంజార, మరాఠీ, హిందీ మాతృభాషలుగల పిల్లలు చదువుతుంటారు. ఎదో

తల, వల వంటి వాచకాలు తప్ప, ఆ భాషల్లో సామెతలు, పొడుపుకథలు, కథలు, పాటలు వంటి సంప్రదాయసాహిత్యం ఇంతవరకూ తయారుకాలేదు.

గిరిజన ప్రాంతానికి వర్తించే పంచాయత్‌రాజ్ చట్టంమీద(పెసా) చాలా ప్రచారం జరిగింది. దీనిమీద గిరిజనులు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. అలాగే సమాచార హక్కుకోసంకూడా చాలామంది పనిచేస్తున్నారు. కాని ఇల్లలుకగానే పండుగకాదు అన్నట్లు, ఈ చట్టాలు గ్రామసభను ఏర్పాటు చేస్తాయి. సమాచారం ఇస్తాయి. కాని సగటు గ్రామసభలో పాల్గొనే వయోజనుడికి ఈ గ్రామసభలు అమలు చేయవలసిన భూమి, అడవి, నీరు చట్టాలు, పథకాలు- వాటి రికార్డులమీద పట్టులేకపోతే, పంచాయతీలు సరిగా పనిచేసేటట్లు చూసుకోవడం సాధ్యం కాదు. సమాచారం అర్థంకాదు. ప్రభుత్వంలో చేరాక ఉద్యోగులు వీటిని నెమ్మదిగా నేర్చుకుంటారు. కాని సామాన్యులు సాధన చేస్తుంటే కాని అవి బోధపడవు. దానికి చాలా పట్టుదల కావాలి, ప్రోత్సాహం ఇవ్వాలి. ఆ పట్టులేకపోతే అధికారులు చెప్పినదానికి తలూపాలి. ప్రభుత్వమే స్వచ్ఛందసంస్థగా ద్విపాత్రాభినయం చేస్తున్న నేటి పరిస్థితుల్లో, అటువంటి ప్రోత్సాహం చాలా అవసరం.

ఉద్యోగులైన గిరిజనులు తమతమ విధులకు పరిమితమైతే, వారిలో నిరుద్యోగులు ఏదో ఒక ఉపాధికోసం ఎదురు చూస్తున్నారు. నాయకులు, రాజకీయాలు, స్వంతపనులలో నిమగ్నమై ఉంటారు. అందువల్ల ప్రభుత్వంతో పనులు చేయించుకోడానికి సామాన్య గిరిజనులకు ఉపయోగపడగల నాయకత్వ లక్షణాలు చదువుకున్న గిరిజనులలో పెరగడంలేదు. దళారీలు పెరిగిపోతున్నారు. వారుతప్ప దారిలేక అమాయకులు చితికిపోతున్నారు.

వివేకానంద 150వ జయంతి ఉత్సవసమితి, ఈ ఉత్సవాల సందర్భంగా 'గిరిజనుల ప్రత్యేకత'ను దేశమంతా గుర్తుచేస్తున్నది. వివేకానందుడు ప్రపంచంలో భారతీయ సంస్కృతిని ప్రచారం చేసి, తాను సంపాదించుకున్న గౌరవప్రతిష్టలను, తన దేశంలో మార్పుకోసం ఉపయోగించాడు. హెమెండార్ఫ్ ఈ తెగలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సలహాలిస్తే, సేతుమాధవరావు వంటి అధికారులు అధ్యయనంతోపాటు ప్రభుత్వంలో పనిచేశారు. వెన్నెలకంటి రాఘవయ్యవంటి వారు అధ్యయనంతోపాటు యానాదుల అభివృద్ధి-నాయకత్వ నిర్మాణం కోసం పాటుపడ్డారు. కాని కాలంతోపాటు పోటీపడే నాయకత్వం గిరిజనులలో తగినంతగా పెరగడంలేదు.

గిరిజనులవంటి దరిద్రనారాయణుల సేవ చేయడానికి పెద్దపెద్ద చదువులు, పదవులు, అధికారాలు, ఉపన్యాసాలు, రాజకీయ నినాదాలకంటె, స్థానికంగా పనిచేసే కార్యకర్తలు రావాలి. వారికి అనుభవం కావాలి. అటువంటి వారిని తయారుచేయడం కోసం, వివేకానందుడు ఉద్బోధించినట్లు గొర్రెగా మారిన సింహంవంటి గిరిజనులను జాతిని మేల్కొలుపుతూ - వారికి శక్తియుక్తులు అందిస్తూ, అందరం నిరంతరం కృషి చేయాలి.

**స్వామివివేకానంద 150వ జయంతి ఉత్సవ సమితి**

ఆంధ్రప్రదేశ్

3-4-228/4/1, జాగృతి భవనము, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ - 500 027, ఫోన్ : 040-27551777